

## నామినేషన్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

జీపీ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ అనుసరిస్తూ కరీంనగర్ జిల్లాలో తొలివిడత సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. తొలి విడతలో కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గంగాధర, రామడుగు, చొప్పదండి, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లోని 92 సర్పంచ్, 866 వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. రామడుగు మండలం వెదిర జీపీలో వెదిర, వెలిచాల గ్రామాల పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించి సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు వంటి అంశాలను పరిశీలిస్తూ సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాటు జరుగకుండా నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలు కూడా రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. కలెక్టర్ వెంట రామడుగు తహశీల్దార్ బండి రాజేశ్వరి, ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాష్, అధికారులు ఉన్నారు.

## 29 నుంచి జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్



### మూడు రోజులపాటు నిర్వహణ

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

కొత్తపల్లి పట్టణంలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్లో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు మూడు రోజులపాటు జిల్లాస్థాయి సైన్స్ఫెర్ నిర్వహిస్తున్నట్లు డీఈవో శ్రీరాం మొండయ్య తెలిపారు. అల్ఫోర్స్ చైర్మన్ వి.నరేందర్రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జయపాల్రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ భగవంతయ్యతో కలిసి గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే వైజ్ఞానిక ప్రదర్శనల గురించి ప్రోత్సాహం అందించాలని, విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయటానికి సైన్స్ ప్రదర్శనలు వేదిక కావాలని సూచించారు. కరీంనగర్ జిల్లా క్రియేటివిటీకి మారు పేరని, విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టే గొప్ప జిల్లా అని, ఏటా కరీంనగర్ జిల్లా నుంచి జపాన్ వెళ్లడానికి ఎంపికవుతున్నారన్నారు. ఈ ఏడాది కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనను ఘనంగా నిర్వహించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ ప్రదర్శనకు 717 నమూనాలు నమోదు అయ్యాయని, ఇందులో 7 జూనియర్, 7 సీనియర్ విభాగంలో ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపుతామని, ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనకు126 నమూనాలు నమోదు అయ్యాయని, ఇందులో నుంచి 13 నమూనాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో కట్ట ఆనందం, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ సమన్వయకర్తలు అనంతాచార్య, మిల్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



## ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకుడు, హాకా మేనేజింగ్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్రెడ్డి, కరీంనగర్ సీపీ గౌష్ ఆలం గురువారం పరిశీలించారు. స్టేట్ అబ్జర్వర్ రామడుగు మండలకేంద్రం, గోపాల్రావుపేట నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేయగా, సీపీ గౌష్ ఆలం రామడుగు మండలం వెదిర జీపీ, స్కూల్, షానగర్, రామడుగు పోలింగ్ కేంద్రాలు, గంగాధర మండలం కురిక్యాల జీపీ, స్కూల్, గంగాధర స్కూల్లోని పోలింగ్ కేంద్రాలను, చొప్పదండి మండలం కాట్నపల్లి, రుక్మాపూర్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. రామడుగు, గంగాధర, చొప్పదండి మండలాల్లోని పోలింగ్ కేంద్రాలు, సున్నితప్రాంతాల పరిస్థితులను సీపీ అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎవరూ చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారని, పోలింగ్ రోజున అదనపు బలగాలు మోహరించనున్నట్లు తెలిపారు. వీరి వెంట ఎండీపీవో జగదీశ్వర్, డీఎల్పీవో హరికిషన్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో శ్రవణ్కుమార్, రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి, కరీంనగర్ రూరల్ సీఐలు ప్రదీప్కుమార్, నిరంజన్రెడ్డి, ఎస్సైలు కె.రాజు, వంశీకృష్ణ, నరేష్రెడ్డి ఉన్నారు.

## ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు తప్పనిసరి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**టీఎన్జీవో భవన్ లో మహిళా ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు**



**శెనార్తి మీడియా, కరీంనగర్ : :** జిల్లాలోని మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షలను మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ టీఎన్జీవో సంఘ భవనంలో ఎన్జీవోల సంఘం, జిల్లా వైద్యారోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మహిళ ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. సుమారు 50 వేల రూపాయలు విలువచేసే 45 రకాల పరీక్షలు ఈ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఈ పరీక్షలు చేస్తారని తెలిపారు. ప్రత్యేక క్యాంపుల ద్వారా కూడా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే టీఎన్జీవో భవన్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతాయని ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో భాగంగా టీఎన్జీవో భవన్లో 300 మంది అంగన్వాడీ సిబ్బంది సహా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసే మహిళా ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందజేసినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బందితోపాటు అపోలో రీచ్, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు ఈ సేవలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సనా, ఉమా శ్రీ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణ్ రావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా సహాధ్యక్షులు ఒంటెల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, మహిళా జేఏసీ నాయకులు ఇరుమల్ల శారద, సునీత, సరిత, విజయలక్ష్మి, లలితమేరీ, రమణ, స్వరూపా, లక్ష్మీ, బాగ్యలక్ష్మి, ఉర్మిళ, అస్గర్ అలీ, గోవిందాపతి శ్రీనివాస్, వాస్తవిక్ గౌడ్, కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, లవ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన పారమిత హెరిటేజ్ విద్యార్థులు..



**శెనార్తి మీడియా, కరీంనగర్ :** ఈ నెల 28,29వ తేదీలలో తెలంగాణ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు పారమిత హెరిటేజ్ విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ హెచ్ఎం గోపీకృష్ణ తెలిపారు. ఈ నెల 28, 29వ తేదీల్లో తెలంగాణ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా మొయినాబాద్ లో జరగనున్న ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్–13 బాలురలో సీహెచ్.అన్విక్ష్, అండర్–15 బాలికల విభాగంలో వై.క్రీనా, అండర్–15 బాలుర విభాగంలో బి.సుక్రీత్, ఎం.రిశబ్, అండర్–17 బాలురలో పి.శశిధృవ్ ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను స్కూల్ చైర్మన్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, కె.హన్మంతరావు అభినందించారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు నాగరాజు, రబీంద్రపాత్రో, రాము, భవాని, పీఈటీలు సరిగొమ్ముల రాజు , సాగర్ పాల్గొన్నారు.

## ఏకగ్రీవం చేస్తే రూ.10 లక్షలు

**– పంచాయతీ ఎన్నికలపై బీజేపీ నాయకుల వ్యాఖ్యలు**



**శెనార్తి మీడియా, బెజ్జంకి :**

బెజ్జంకి మండల బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జిల్లా అధ్యక్షుడు, పంచాయతీ ఎన్నికల ఇంచార్జ్ గంగాడి మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన రూ.3,000 కోట్లు నిలిచిపోయాయని విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్యం పూర్తిగా కేంద్ర నిధుల ద్వారానే జరుగుతున్న నేపథ్యంలో ఈజీఎస్ పనులు, స్మశానాలు, డంపింగ్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు, సీసీ రోడ్లు, ఉజ్వల, అవాస్ యోజన, విద్య–వైద్య సదుపాయాల వంటి పథకాల ప్రయోజనాలను వివరించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిధులతో బెజ్జంకి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవమైతే వెంటనే రూ.10 లక్షలు మంజూరు చేస్తామని గంగాడి మోహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్ రెడ్డి, బుర్ర మల్లేశం గౌడ్, గైని రాజు, సానం వేణు, రామచంద్రం, సంఘ రవి, రాములు తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# పంచాయతీల్లో 'పెద్ద' గంగాధర

- ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్దది
- అతి చిన్న మండలంగా కొత్తపల్లి
- గంగాధరలో 33, కొత్తపల్లిలో 6 గ్రామ పంచాయతీలు

**శెనార్తి మీడియా, కరీంనగర్(గంగాధర) :**

జిల్లాలు, మండలాల పునర్విభజనలో భాగంగా చొప్ప దండి నియోజకవర్గం కొత్తరూపును సంతరించుకుంది. చొప్పదండి నియోజకవర్గంలో బోయినపల్లి, కొడిమ్యాల, మల్యాల, గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాలు ఉన్నాయి. ఈ మండలాలు మూడు జిల్లాల పరిధిలోకి వెళ్లాయి. బోయినపల్లి మండలం రాజన్న సిరిసిల్ల జిల్లాలోకి, కొడిమ్యాల, మల్యాల మండలాలు జగిత్యాల జిల్లాలోకి, రామడుగు, గంగాధర, చొప్పదండి మండలాలు కరీంనగర్ జిల్లాలోకి వెళ్లాయి. కరీంనగర్ జిల్లాలోని మండలాలన్నింటిలో అత్యధిక గ్రామ పంచాయతీలు, ఎక్కువ గ్రామాలను కలిగి ఉంది గంగాధర మండలమే. దీనికితోడు ఈ మండలం చొప్పదండి నియోజకవర్గంలోని మిగతా ఐదు మండలాలకు కేంద్రబిందువు. ఈ మండలంలో ఇంతకుముందు 45 గ్రామాలు 23 గ్రామ పంచాయతీలు ఉండేవి. జనాభా ప్రాతిపదికన గత బీఆర్ఎస్ సర్కారు చిన్న ఆచంపల్లి, మధురానగర్, మంగపేట, చెర్లపల్లి (ఎన్), చెర్లపల్లి(ఆర్), లింగంపల్లి, కోట్లనర్సింహులపల్లి, మర్రిగడ్డ, ముప్పిడినర్సయ్యపల్లి, ఇస్లాంపూర్ గ్రామాలను కొత్త గ్రామ పంచాయతీలుగా మార్చారు. కొత్తగా ఏర్పాటుచేసిన ఈ 10 గ్రామపంచాయతీలతో కలిపి గంగాధర మండలంలో మొత్తం 33 గ్రామపంచాయతీలు అయ్యాయి.

**296 వార్డులు**

గంగాధర మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో సగటున 8 నుంచి 14 వార్డుల చొప్పున 296 వార్డులు ఉన్నాయి. ఈ వార్డులకు కూడా అధికారులు రిజర్వేషన్లు కేటాయించారు. మండలంలో అత్యధికంగా బీసీ ఓటర్లు, అత్యల్పంగా ఎస్టీ ఓటర్లు ఉన్నారు. మండలంలో మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లే ఎక్కువ. రాజకీయంగా చైతన్యవంతమైన గంగాధర మండలంలో పంచాయతీ ఎన్నికలు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు సవాలుగా మారాయి.




**అతిచిన్న మండలంగా కొత్తపల్లి**

కొత్తపల్లి మండలం ఆరు జీపీలతో అతిచిన్న మండలంగా మారింది. గత పంచాయతీ ఎన్నికల్లో 8 జీపీలుండగా మల్కాపూర్, చింతకుంట గ్రామాలను కరీంనగర్ కార్పొరేషన్లో విలీనం చేయడంతో ఆసిఫ్నగర్, కమాన్పూర్, ఎలగందల్, బద్దిపల్లి, నాగులమల్యాల, ఖాజీపూర్ గ్రామాలతో అతిచిన్న మండలంగా ఏర్పడింది. మండలంలోని 6 గ్రామపంచాయతీల్లో సగటున 8 నుంచి 14 వార్డుల చొప్పున 62 వార్డులు ఉన్నాయి.

**వేడెక్కుతున్న రాజకీయం**

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే మండలం బూరుగుపల్లికి చెందిన సుంకె రవిశంకర్ చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం అందరికీ తెలిసిందే. దీంతో పంచాయతీ ఎన్నికలు కూడా మండలంలో సవాల్గా మారాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ గ్రామాలను ఎలాగైనా ఏకగ్రీవం చేయాలనే ఆలోచనలో ఉంది. ఏకగ్రీవం అయితే గ్రామం అభివృద్ధి చెందుతుందని కొంతమంది ఆశావహులు ఏకగ్రీవం అంశాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. పలుకుబడి, ఆర్థికంగా బలంగా ఉన్న నాయకులు పలువురు సర్పంచ్గా తనను ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి కొంతమొత్తం ఇస్తామంటూ గ్రామపెద్దలకు, ఇతర ఆశావహులకు ఆఫర్లు ఇచ్చే పనిలో ఉండగా.. మరికొందరు తమ గాడ్ఫాదర్లను ప్రసన్నం చేసుకునే దిశలో ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాగా ఏకగ్రీవపంచాయతీలకు ప్రభుత్వం గతంలో ఇచ్చే రూ.9.17 లక్షలను ఐదువేల జనాభా ఉంటే రూ.10 లక్షలు, ఐదు వేల పైబడి జనాభా ఉంటే రూ.15 లక్షలకు పెంచింది. సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకంతో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందన్న భావనతో ఎక్కువమంది అధికార పార్టీ నాయకులు ఏకగ్రీవానికి సై అంటున్నారు. కానీ మిగతా పార్టీల నాయకులు తామేమీ తక్కువ కాందంటూ సమరానికి సన్నద్ధమవుతున్నారు.



## నామినేషన్ల పర్వం

**శెనార్తి మీడియా, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లాలో 92 పంచాయతీల్లో గురువారం 93 మంది అభ్యర్థులు సర్పంచ్ గా తమ నామినేషన్లు దాఖలు చేశారు. గంగాధర మండలంలో 29, రామడుగులో 27, కొత్తపల్లిలో 12, చొప్పదండిలో 15, కరీంనగర్ రూరల్ మండలంలో 14 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

